నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నల్లగండ్ల, నల్లగండ్ల మెయిన్‌ రోడ్డు,డిమార్ట్‌ ఏరియా, మెడిప్లస్‌ లేన్‌ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు వివరించారు.

- 11 కేవీ డైమండ్‌ హిల్స్‌ ఫీడర్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు డైమండ్‌ హిల్స్‌, జవహర్‌నవోదయ విద్యాలయ ఎదురుగా ఉండే ప్రాంతం, నల్లగండ్ల హుడా కాలనీ ప్రాంతంలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు వివరించారు.
- 11 కేవీ ఎపిస్టెమో గ్లోబల్‌ ఫీడర్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నల్లగండ్ల హుడాకాలనీ, ఎపిస్టెమో స్కూల్‌, సాధన స్కూల్‌, తెల్లాపూర్‌ రోడ్‌, నల్లగండ్ల హుడా మేయిన్‌ రోడ్డు ప్రాంతంలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు వివరించారు.

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనా రెడ్డి పేర్కొన్నారు.

- ఆదిత్యనగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఫ్రెండ్స్‌ ఫంక్షన్‌ హాల్‌ ఏరియా, ఎస్‌సీబీ కాలనీ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.
- మైత్రీనగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 01.30 గంటల నుంచి 03.00 గంటల వరకు ఆల్విన్‌ కాలనీ ఎక్స్‌ రోడ్డు, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ ఫేజ్‌ 1,2,3,4,5, జనప్రియనగర్‌, భానుటౌన్‌షిప్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

కౌశిక్‌రెడ్డి తన మాటలను ఉపసంహరించుకోవాలి

శేరిలింగంపల్లి: అహంకారంతో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడిన మాటలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్‌ గౌడ్‌ శుక్రవారం డిమాండ్‌ చేశారు. ప్రాంతీయ భేదాలు తీసుకువచ్చి హైదరాబాద్‌ బ్రాండ్‌ ఇమేజ్‌ను దెబ్బతీసేలా కుట్ర చేస్తున్న వారు ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. చిల్లర రాజకీయాలు చేయవద్దని కోరారు.

ఖాజాగూడలో కూల్చివేతలు



రాయదుర్గం: ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసిన వాటిని శుక్రవారం కూల్చివేశారు. శేరిలింగంపల్లి రెవిన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణలో ఖాజాగూడలోని సర్వేనెంబర్‌ 40 లోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసినట్లు రెవిన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించారు, దీంతో స్థలం చుట్టూ వేసిన రేకులను పూర్తిగా తొలగించారు. అంతేకాకుండా ఇతర శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలను కూడా తొలగించారు.ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తామని రెవిన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలలో ఎవరూ నిర్మాణాలు చేయరాదని, ఒక వేళ చేస్తే నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు.

రూ.97వేలు పలికిన గణనాథుడి లడ్డూ



లడ్డూను కైవసం చేసుకున్న జితేందర్‌

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ గ్రామంలోని కుమ్మరి బస్తీ గణ నాథుడి లడ్డూ రూ.97వేలు పలికింది. హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కుమ్మరి బస్తీ వినాయకుడి లడ్డూ వేలం నిర్వహించగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి (రంగారెడ్డి అర్బన్‌) కైతాపురం జితేందర్‌ రూ.97వేలకు కైవసం చేసుకున్నారు. ఉత్సవ కమిటి ప్రతినిధులు ఆయనకు ప్రత్యేక పూజలను నిర్వహించి లడ్డును అందజేశారు. మరో లడ్డూను కైతాపురం రవితేజ రూ.21వేలకు కైవసం చేసుకున్నారు.

మాజీ కార్పొరేటర్‌ హౌస్‌ అరెస్ట్‌



రాయదుర్గం: బీఆర్‌ఎస్‌ సమావేశానికి వెళ్ళడానికి సిద్ధమైన మాజీ కార్పొరేటర్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు కొమిరిశెట్టిసాయిబాబాను రాయదుర్గం పోలీసులు హౌజ్‌ అరెస్ట్‌ చేశారు. శుక్రవారం ఉదయమే ఆయన బీఆర్‌ఎస్‌పార్టీ సమావేశానికి వెళ్ళడానికి సిద్ధమై బీఆర్‌ఎస్‌ నాయకులతో మాట్లాడుతుండగా పోలీసులు వచ్చి అడ్డుకొని వారిని హౌజ్‌ అరెస్ట్‌ చేస్తున్నామని ప్రకటించి లోపలికి వెళ్ళాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చందానగర్‌: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంధ్య తెలిపిన ప్రకారం చందానగర్‌ ప్రధాన రోడ్డుపై ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) శుక్రవారం ఉదయం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే పోలీసులు ఘటన స్థలంకు చేరుకొని పరిశీలించారు. అప్పటికే అతని మృతి చెందిందని నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి అదృశ్యం

మియాపూర్‌: మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు.సీఐ దుర్గా రామలింగ ప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని గోకుల్‌ ప్లాట్స్‌ కాలనీలో నివాసముంటున్న రామరాజు కుమారుడు తనీష్‌ వర్మ(20) గురువారం ఉదయం ఇంటినుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుప్రక్కల ఎంతవెతికిన ఆచూకి లభ్యం కాలేదు. ఆందోళన చెందిన తండ్రి రామరాజు మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ ఫిర్యాదు చేశాడు.

నిమజ్జనంపై ప్రత్యేక దృష్టి

ప్రతి చెరువు కోనేరు వద్ద ఒక నోడల్‌ ఆఫీసర్‌ పర్యవేక్షణ



శేరిలింగంపల్లి గోపీచెరువు వద్ద ఏర్పాటు చేసిన క్రేన్లు

- ఈనెల 19వ తేదీ వరకు పర్యవేక్షణ
- శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో ప్రతి కోనేరు వద్ద 2 క్రేన్లు ఏర్పాటు
- అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణ
- లింగంపల్లి చాకలి చెరువు, గోపన్‌పల్లిలో తాత్కాలిక నిమజ్జన ఏర్పాట్లు

శేరిలింగంపల్లి: గణేష్‌ నిమజ్జన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం పూర్తి స్థాయి దృష్టి పెట్టిం ది. ఇప్పటికే కొన్ని చోట్ల నుంచి నిమజ్జనాలు సాగిస్తూ ఉన్నారు. ఇక 17వ తేదీ న జరిగే 11 రోజుల సామూహిక నిమజ్జనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేసేందుకు శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని అధికారయంత్రాంగం ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. నిమజ్జన ఏర్పాట్లను జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి నాయకత్వంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తూ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు జోనల్‌ కమిషనర్‌, డిప్యూటీ కమిషనర్‌లు ఇతర అధికారులతో కలిసి నిమజ్జనాలకు ఏర్పాట్లను స్వయంగా తిరిగి పరిశీలించారు.

ప్రతి చెరువు వద్ద కోనేరుకు ఒక నోడల్‌ ఆఫీసర్‌..

- శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని ప్రతి చెరువు గణేష్‌ నిమజ్జన కోనేరు వద్ద పర్యవేక్షణకు ఒక నోడల్‌ ఆఫీసర్‌ పర్యవేక్షణ చేస్తారు.
- ఆయన పర్యవేక్షణలో జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగా ఉద్యోగులు, సిబ్బంది, అదేవిధంగా వైద్య, విద్యుత్‌, ఆర్‌ అండ్‌ బీ, పోలీసులు, ట్రాఫిక్‌ విభాగం,ఫైర్‌ శాఖల చెందిన అధికారులు, ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తుంటారు.
- ఈనెల 19వ తేదీ వరకు అధికారుల పర్యవేక్షణ సాగుతుంది, కానీ 17వ తేదీన జరిగే సామూహిక నిమజ్జనాలు జరుగుతాయి, వీటిని ఈ అధికార యంత్రాంగం పర్యవేక్షిస్తుంది.

ప్రతి చెరువు వద్ద రెండే క్రేన్లు

- శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని ప్రతి చెరువు వద్ద ముఖ్యంగా రాయదుర్గం మల్కం చెరువు, లింగంపల్లి గోపిచెరువు, నల్లగండ్ల చెరువు,దుర్గంచెరువు వద్ద ఉండే గణేష్‌ నిమజ్జన ప్రదేశాల వద్ద రెండేసి చొప్పున పెద్ద క్రేన్లను ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.
- ఇక అత్యధిక సంఖ్యలో నిమజ్జనాలు సాగే మల్కంచెరువు గణేష్‌ నిమజ్జన కోనేరు వద్ద మరో క్రేన్‌ కూడా అందుబాటులోకి తేవాలని తాజాగా నిర్ణయించారు. మల్కం చెరువులో రాయదుర్గం, గచ్చిబౌలి, పరిసరాల్లోని వారే కాకుండా, జూబ్లీహిల్‌, రాజేంద్రనగర్‌ నియోజకవర్గంలోని వివిధ కాలనీల వాసులు, మల్కంచెరువు చేరువలోని వారు కూడా ఇక్కడే నిమజ్జనాలు చేస్తుండడంతో మరిన్ని ఏర్పాట్లు చేయడంపై అధికారులు దృష్టి పెడు తున్నారు.
- అంతే కాకుండా లింగంపల్లిలోని చాకలి చెరువు, గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం ముందుండే రంగనాథచెరువు వద్ద తాత్కాలికంగా గణేష్‌ నమజ్జనాలు స్థానికులు, పరిసరాల కాలనీలు,బస్తీలవాసులు కూడా నిమజ్జనాలు చేసుకోవడానికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

వాడవాడలా భక్తిభావం



కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్‌

వాడవాడలా భక్తిభావన వెల్లివిరుస్తోంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధి కాలనీలు, బస్తీలు, గేటెడ్‌ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో ప్రతిష్ఠించినగణేషుడి వద్ద నిత్య పూజలను కొనసాగిస్తున్నారు. ఆయా వేళల్లో స్థానికులు హజరై గణేషుడిని దర్శించుకుంటున్నారు. సాంస్కృతిక కార్య క్రమాలు, మ్యాజిక్‌షోలు, ప్రత్యేక భజనలు, హోమాలు, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్‌ కమ్యూనిటీలలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి వినాయక ఉత్సవాలు సాగిస్తున్నారు. – శేరిలింగంపల్లిజోన్‌ బృందం



తారానగర్‌లో..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



సుదర్శన్‌నగర్‌లో..



మసీదుబండలో చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మియాపూర్‌ తివారినగర్‌లోని త్రిస్టార్‌ హోమ్స్‌లో 108 రకాల ప్రసాదాలు

వర్తమాన రాజకీయాల్లో ధ్రువతార ఏచూరి



ఏచూరి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



సీతారాం ఏచూరికి నివాళ్ళుర్పిస్తున్న సీపీఐఎం నాయకులు

గచ్చిబౌలి: వర్తమాన రాజకీయాల్లో సీతారాం ఏచూరి ధ్రువతార అని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్‌ సభ్యులు ఆర్‌.సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశబ్దాల పాటు కమ్యూనిస్ట్‌ సిద్ధాంతాల కోసం అలుపెరగని పోరాటం సాగించారని పేర్కొన్నారు. సామాన్యుల జీవితంలో వెలుగులు నింపడానికి కృషి చేశారని, ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. రాజ్యసభ సభ్యునిగా సేవలందిస్తూ ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో కామ్రేడ్‌ అనీల్‌, ఎస్‌.శ్రీనివాస్‌ రావు, విజయ్‌ కుమార్‌, రవిందర్‌ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి జోన్‌ కమిటీ ఆధ్వర్యంలో..

చందానగర్‌: సీపీఐఎం శేరిలింగంపల్లి జోన్‌ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చందానగర్‌ అంబేద్కర్‌ విగ్రహం వద్ద సీతారం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళుర్పించారు. ఈ సందర్భంగా జోన్‌ కమిటి సభ్యులు సీతారాం కమ్యూనిస్టు పార్టీ చేసిన సేవలతో పాటు పేద ప్రజల కోసం జీవితమంతా పోరాడారని గుర్తు చేసుకున్నారు. జోన్‌ కార్యదర్శి శోభన్‌, కమిటి సభ్యులు మాణిక్యం, కృష్ణ, మధుసూధన్‌రావు, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి



బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముందు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్‌ యాదవ్‌

గచ్చిబౌలి: ప్రజా సమస్యలను గాలికి వదిలి దాడులకు పాల్పడుతున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్‌ యాదవ్‌ డిమాండ్‌ చేశారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముందు ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే కౌశిక్‌ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ఆడుతున్న నాటమని ఆయన అన్నారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలు రెండు ఒకటేనని, అభివృద్ధి అనే సాకుతో గాంధీ పార్టీలు మారుతున్నారని విమర్శించారు. పీఏసీ చైర్మెన్‌ పదవి ప్రతిపక్ష హోదాలో ఉన్న వారికి ఇవ్వకుండా నిబద్ధత లేని, ప్రజల విశ్వాసం లేని వారికి కెటాయించడం తగదన్నారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి కన్వీనర్‌ రాఘువేంద్రరావు, నాయకులు నాగులు గౌడ్‌, రాధాకృష్ణ యాదవ్‌, అరుణ్‌ కుమార్‌ , వేణుగోపాల్‌, పద్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఎడిటర్‌ ఇన్‌ చీఫ్‌గా హెచ్‌సీయూ ప్రొఫెసర్‌



ప్రొఫెసర్‌ అజైలియునియుమై

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్‌ అజైలియునియుమై 'అంత్యజా' ఇండియన్‌ జర్నల్‌ ఆఫ్‌ విమెన్‌ అండ్‌ సోషల్‌ చేంజ్‌కి ఎడిటర్‌ ఇన్‌ చీఫ్‌గా నియమితులయ్యారు. ఆమె హెచ్‌సీయూలో సోషియాలజీ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.'సేజ్‌' జర్నల్స్‌ అంజ్యజాకి ఎడిటర్‌ ఇన్‌ చీఫ్‌గా నియామకం కావడం విశేషం.

ఆరోగ్య సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

డాక్టర్‌ విష్ణున్‌రావు



కాచిగూడ: మారిన జీవన విధానంతో జబ్బుల బారిన పడుతున్నారని, ప్రజలు ఆరోగ్య సంరక్షణకు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అలర్జీ, ఆస్తమా వైద్య నిపుణులు డాక్టర్‌ వీరపనేని విష్ణున్‌ రావు అన్నారు. గురువారం నారాయణగూడ లోని శ్వాస హాస్పిటల్‌లో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఓవైపు గాలి కాలుష్యం, మరోవైపు రసాయనాలతో ఉత్పత్తిచేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రోజూ వ్యాయామం చేయాలని, కొవ్వు పదార్థాలు, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలని అన్నారు.

చికిత్స కోసం చిన్నారికి ఆర్థికసాయం



మోతీనగర్‌: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవ ధర్మమని వీర లింగేశ్వర సేన కురుమ సంఘం ప్రతినిధులు అన్నారు. బంజారాహిల్స్‌ శ్రీరామ్‌నగర్‌కు చెందిన గడ్డమీది నరేందర్‌, కీర్తి దంపతుల కుమారుడు బ్రెయిన్‌ ట్యూమర్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తండ్రి గతంలో మృతి చెందాడు. తల్లి కుమారుడిని పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. చిన్నారి మిథున్‌ (4) బ్రెయిన్‌ ట్యూమర్‌ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న కురుమ సంఘం ప్రతినిధులు ఆసుపత్రి వైద్యం కోసం రూ.1.66 లక్షలను సేకరించి శుక్రవారం చిన్నారి మిథున్‌ కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రత్యామ్నాయ రోడ్లలో ప్రయాణించాలి

గచ్చిబౌలి: సర్వీస్‌ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ రోడ్లలో ప్రయాణించాలని సైబరాబాద్‌ జాయింట్‌ కమిషనర్‌ సోయల్‌ డెవిస్‌ సూచించారు. జెఎన్‌టీయూ వైపు వెళ్లే సైబర్‌ టవర్‌ ఫ్లై ఓవర్‌ ఎండ్‌ నుంచి యశోద హస్పిటల్‌ వరకు సర్వీస్‌ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. సైబర్‌ టవర్‌, కొత్తగూడ, 100 ఫీట్‌ రోడ్డు నుంచి జెఎన్‌టీయూ, మూసాపేట్‌ వైపు వాహనదారులు ప్రత్యామ్నాయ రోడ్లలో వెళ్లాలన్నారు. జెఎన్‌టీయూ, మూసాపేట్‌కు వెళ్లే వాహనాలు పర్వత్‌నగర్‌ జంక్షన్‌ నుంచి కైత్లాపూర్‌ ఫ్లైఓవర్‌ మీదుగా వెళ్లాలన్నారు. ఐకియా, సైబర్‌ గేట్‌ వే,, సీఓడీ జంక్షన్‌ నుంచి వచ్చే వాహనాలు నేరుగా సైబర్‌ టవర్‌ ఫ్లై ఓవర్‌ మీదుగా వెళ్లవచ్చన్నారు. సైబర్‌టవర్‌ కింద వైపు నుంచి జేఎన్‌టీయూ వైపు వెళ్లాల్సిన వాహనాలు ఎన్‌ కన్వెన్షన్‌ మీదుగా, జైన్‌ ఎన్‌క్లేవ్‌ వద్ద కుడివైపు తిరిగి యశోద వెనక వైపు ఉన్న రోడ్డులో జేఎన్‌టీయూ ఆర్‌ఓబీ వైపులు వెళ్లాలని సూచించారు. ప్రత్యామ్నాయ రహదారుల్లో ప్రయాణించి, ట్రాఫిక్‌ జాం కాకుండా సహకరించాలని వాహనదారులను కోరారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు నాలుగురికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించిందని ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... గురువారం నిర్వహించిన డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో నలుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి.. ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ప్రణాళికాబద్ధంగా డివిజన్ల అభివృద్ధి

ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి



రహదారి పనులకు కార్పొరేటర్‌తో కలిసి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్‌లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని చైతన్య నగర్‌, శిశుమందిర్‌ కాలనీలలో 20 లక్షల రూపాయల అంచనాతో నిర్మించ చేపట్టిన రహదారుల పనులకు కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలలో రహదారులు, అంతర్గత డ్రైనేజీల నిర్మాణ పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌ కమి టీ చైర్మన్‌ విజయ్‌ కుమార్‌, అఫ్జల్‌, వెంకటేశ్‌, అఖ్యత్‌, సీనియర్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్‌





లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి కిందకు వచ్చిన వరద నీరు, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యాలు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద శుక్రవారం ట్రాఫిక్‌ స్తంభించిపోయింది. అండర్‌ బ్రిడ్జి వద్ద పైప్‌లైన్‌ పనులు మరమ్మతులు చేపట్టడంతో ఒక్కసారిగా వరద నీరు పెద్ద ఎత్తున వచ్చింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఉదయం 8 గంటల సమయంలో ఈ పనులు చేపట్టడంతో స్కూల్‌ బస్సులు, ఆఫీసులకు వెళ్లే వారు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. చందానగర్‌ హుడా కాలనీ నుంచి వచ్చే వాహనాలు, గుల్‌మొహర్‌పార్కు కాలనీ నుంచి, తారానగర్‌ నుంచి వచ్చే మార్గాల్లో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ పోలీసులు వాహనాలను మళ్ళించేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. వర్షాలు వచ్చేటప్పుడే అక్కడ సమస్య ఉంటుందని వాహనదారులు, ఉద్యోగులకు, స్థానికులకు తెలుసు. కానీ మరమ్మతు పనులు చేసేటప్పుడు ట్రాఫిక్‌ను మళ్ళించేలా ముందుస్తు సమాచారం అందిస్తే ఈ సమస్య వచ్చేది కాదని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు చేసే సమయంలో అటు వాహనాలు రాకుండాముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.



గుల్‌మొహర్‌పార్కు కాలనీ వైపు నుంచి వచ్చే వాహనాల దృశ్యం

శాతవాహననగర్‌ పార్కును అభివృద్ధి చేస్తాం



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని శాతవాహన నగర్‌లోని రాంకి పెరల్‌ వద్ద ఉన్న పార్కును అభివృద్ధి చేస్తామని డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. శుక్రవారం కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. పార్కు అభివృద్ధికి తగిన సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్కు సుందరీకరణ కోసం రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పార్కులో ఓపెన్‌జిమ్‌, ప్రహరీ మరమ్మతులు, వాకింగ్‌ ట్రాక్‌ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, అందే నరసింహ, యాదిరెడ్డి, విష్ణు, కృష్ణమూర్తి, వెంకటరామిరెడ్డి, వర్కు ఇన్స్‌పెక్టర్‌ రవికుమార్‌, కాలనీ వాసులు పాల్గొన్నారు.